రాయుడు గారింట్లో గడియారం టంగ్ టంగ్ మని పదకొండు గంటలు కొట్టింది. మంచంమీద పడుకునే గంటలను లెక్కబెట్టింది భవాని. మరో మూడు గంటల్లో తను తన వారందరినీ ఈ ఇంటినీ వదిలి వెళుతుంది కాబోలు ననుకుంది అలా అనుకోగానే భవాని గుండె బరువెక్కింది.

అందరూ మంచి నిద్రలో వున్నారో లేదో చూడాలనుకుంది, మెల్లగా మంచం మీద లేచి కూర్చుని ఓసారి చుట్టూ చూసింది. మంచాల మీద అందరూ గాఢ నిద్రలో మునిగిపోయి వున్నారు.

దాహమవుతున్నట్టనిపించింది భవానికి. వంటగది వయిపు నడిచింది. దగ్గరకు వేసివున్న తలుపులను నెట్టుకొని గోడకు వెళ్ళి లైటు వేసింది

వెలుతురు కళ్ళ మీద పడగానే తలెత్తి, కళ్ళు విప్పింది "ఎవరది?" అన్నది భవాని తల్లి.

"నేనే అమ్మా"

"నువ్వేనా భవానీ" అని ఆమె గోడ వయిపు తిరిగి కళ్ళు మూసుకుంది.

మంచినీళ్ళు తాగివచ్చి ఓ అయిదు నిమిషాలసేపు మంచం మీద కూర్చుంది.

అంతా నిశ్శబ్దంగా వుంది— ప్రక్క ఇంట్లో ఫ్యాను తిరుగుతున్న శబ్దం చాలా స్పష్టంగా వినిపిస్తోంది. ఆ మధ్య గదిలో వెలుగుతున్న జీరోవోల్టు బల్బు కాంతి గది అంతా మసకగా ఆవరించుకుంది.

భవానికి నిద్ర రావటంలేదు. రోజూ అయితే పది గంటలు అయ్యేసరికి నిద్ర పట్టి నిద్రపోయేది కాని ఈ రోజు అలా కాదు. ఓ ప్రత్యేకమయిన రోజు. తన జీవితాన్ని మరో వైపుకు మళ్ళిస్తున్న రోజు. ఇరవై యేళ్ళపాటు తనని పెంచి పెద్ద చేసిన తల్లిదండ్రులను వదులుకుని ఏడాది క్రితం తన ఆలోచనల్లో చోటు చేసుకున్న ఓ మనిషి కోసం వెళ్ళిపోతున్న రోజు. అందుకే తనకు నిద్ర రావడం లేదు.

అమాయకంగా ఒళ్ళు మరచి నిద్ర పోతున్న వారిని చూస్తుంటే తను వారందరినీ మోసంచేసి వెళ్ళిపోతున్నట్టనిపించింది భవానికి. తను వెళ్ళిపోగానే వాళ్ళు లేచి చూస్తారు. తను కనిపించక పోయేసరికి ఆదుర్దా పడతారు. చివరికి తను విశ్వనాథంతో వెళ్ళిపోయిందని తెలియగానే తలలు పట్టుక్కూర్చుంటారు,


నిజమే. తను చేస్తున్న పని వాళ్ళకు ఎంత తలవంపులను తెస్తుంది? ఇప్పుడు తనకు తెలుసు తను చెయ్యబోతున్నది తప్పనీ, న్యాయమయినది - కాదనీ తెలుసు. అయినా తను విశ్వనాథంతో వెళ్ళకుండా వుండలేదు.

కాని — ఈరోజు తను ఇలా ఎవరికీ తెలియకుండా అర్ధరాత్రివేళ వెళ్ళిపోవడానికి కారణం ఏమిటి? తన తల్లి దండ్రులు కదూ? వాళ్ళే విశ్వనాథంతో తన పెళ్ళికి ఒప్పుకుని వుంటే తను ఇలా చెయ్యవలసిన పనివుండేదా?

పడుకొని ఆలోచిస్తోంది. ఆమెలో ఒక రకమయిన ఆవేశం కలుగుతోంది. ఆలోచనలు వెనక్కు పరుగు తీస్తున్నాయి.

భవాని ఆలోచనలకు భంగం కలిగింది. ఆమె తమ్ముడు లేచి లైటువేశాడు. నిద్ర పోతున్నట్టు కళ్ళు గట్టిగా మూసుకుంది భవాని. అతను లోపలికు వెళ్ళి మంచినీళ్ళు తాగుతున్నాడు.

'చివరికి ఈ వెధవ కూడా తను విశ్వనాథంను చేసుకుంటానంటే ఒప్పుకోలేదు' అనుకుంది భవాని. అతనికి పద్నాలుగేళ్ళుంటాయి. టెంత్ క్లాసు చదువుతున్నాడు. "మనకులం కాని వాడిని ఎట్టా చేసుకుంటావ్ అక్కయ్యా?" అని అడిగాడు..



# వెళ్ళిపో అక్కా

ప్రతాప రవిశంకర్

అమ్మా నాన్న పాడని పాటని వాడు కూడా పాడాడు. అయినా తను ఎవరి మాటలనూ పట్టించుకోదల్చుకోలేదు. వాళ్ళతో యుద్ధం చెయ్యదల్చుకోలేదు.

అతను వచ్చి లైటు తీసి మళ్ళీ పడుకున్నాడు.

ఎవరు ఎంతగా ఎదురు పడినా తను తన పట్టును విడవదల్చుకోలేదు విశ్వనాథంతో జీవితాన్ని పంచుకోవాలనుకుంది. వెళ్ళిపోతుంది. ఎవరేమనుకుంటే తనకేం? తన మనసును గ్రహించనప్పుడు?

భవానికి అసహనంగా వుంది. ఎప్పుడెప్పుడు రెండు గంటలవుతుందా అని ఎదురు చూస్తోంది. అప్పటికి పన్నెండు గంటలు దాటింది.

ఇంటివెనుక వున్న రోడ్డుమీద ఏదో కారు వేగంగా వెళ్ళిన చప్పుడు వినిపించింది. రోడ్డు చివర్న అరుస్తున్న కుక్కల అరుపులు.

విసుక్కుంది భవాని వెధవ కుక్కలు, ఒకటే అరుపులు ఈ అరుపులకు ఇంట్లో ఎవరికయినా మెలకువ వస్తుందేమో. తీరా తను బయల్దేరే సమయానికి ఎవరయినా లేచి కూర్చున్నారంటే తన పని అయినట్లే!

ఇప్పుడు విశ్వనాథం కూడా తనలాగే నిద్రపోకుండా ఆలోచిస్తున్నాడు కాబోలు అనుకుంది భవాని. అవును. అతని పరిస్థితి కూడా తనలాంటిదే అతని వాళ్ళకూ తనని వాళ్ళ ఇంటిదీపం చేసుకోవడం ఇష్టంలేదు. ఏం మనుషులో వీళ్ళు? అనుకుంది.

# వెళ్ళిపో అక్కా

ఎవరో మంచంమీద కదిలిన చప్పుడు వినిపించింది. తల తిప్పి చూసింది తండ్రి తల్లిని పిలిచాడు.

"ఏమేవ్? విన్నే ఉక్కబోస్తోంది. ఆ ఫ్యాను వెయ్యి"

రెండు నిమిషాల తర్వాత బద్ధకంగా లేచింది భవాని తల్లి. ఫ్యాను స్విచ్ నొక్కింది. గాలి ఆ గదినంతా ఆక్రమించుకుంది

అరగంట గడిచింది.

గడియారం ఒంటిగంట కొట్టింది.

భవాని అందుకోసమే ఎదురు చూస్తున్నట్టు లేచింది. చప్పుడు కాకుండా మెల్లగా పక్కనున్న గదిలోకి వెళ్ళింది.

దండెంమీద వేలాడుతున్న తన చీరలను తీసి సూట్కేసులో పడేసింది. ఇంకా అలమార్లలో, బీరువాలో వున్న తన బట్టలను తీసి అందులో పడేసింది. తన పర్సులోవున్న డబ్బును లెక్క చూసుకొని సూట్కేసులో పెట్టేసింది. బట్టలు సర్దుకుంటున్నంతసేపూ భవాని గుండెలు దడదడమని కొట్టుకున్నాయి. ఎవరైనా లేస్తారేమో ..

తన అదృష్టం ఎవరూ లేవలేదు. సూట్కేసుతో మధ్యగదిలోకి వచ్చింది. అందరినీ మరోసారి చూసింది.

తనని కనిపెంచిన తల్లి.. తన గుండెల మీద కూర్చోబెట్టుకొని ఆటలాడి నవ్వించి పెంచి చదువు చెప్పించిన తండ్రి— తనతో పాటు కలిసి పెరిగిన చెల్లెళ్ళు, తమ్ముడు. ఇన్నాళ్ళ బంధాలను తెంచుకొని ఒక్క మనిషి కోసం ఇంతమంది మనసులను బాధ పెట్టి క్రూరంగా వెళ్ళిపోవడం...

సూట్కేసు విసిరేసి మంచం మీద పడుకుని భోరున ఏడ్వాలనిపించింది భవానికి దుఃఖం వచ్చింది. వెళ్ళిపోవాలని ఎంత దృఢంగా అనుకున్నా కన్నవాళ్ళను వదలి వెళ్ళడం అంత సులభం కాదేమోననిపించింది

ఎందుకు కాదు?

ఆడదానిగా పుట్టిన తర్వాత ఎవరయినా కన్నవారిని వదిలి మరో మనిషితో వెళిపోవలసిందే. తనూ అంతే.. ఇందులో బాధపడవలసింది ఏమీలేదు...

తల్లి దగ్గరగావచ్చి నిలబడి చూసింది. నుదుట రూపాయి కాసంత బొట్టు పెట్టుకుని నిద్రపోతోంది.

తన చేతులతో తన పెళ్ళి చేయాలని ఎన్ని కలలు కన్నదో. తనే పెద్దకూతురు. అమె, కన్న కలలన్నింటినీ నాశనం చేసి వెళ్ళిపోతోంది తను.. తను ఇస్తున్న ఈ షాక్‌కి తల్లి తట్టుకోగలదా?

ఎక్కువ సేపు తల్లి దగ్గర నిలబడలేక పోయింది భవాని తల్లిని చూస్తూ ఆలోచిస్తుంటే తన నిర్ణయం పట్టుదల ఎక్కడ సడలిపోతాయోనని భయపడింది..

తండ్రినీ, చెల్లెళ్ళనూ తమ్ముడినీ చూసి బయట తలుపు దగ్గరకు వచ్చింది ..

చప్పుడు కాకుండా తలుపు తెరిచింది ఒక్కసారి వెనక్కు తిరిగి చూసి బయట అడుగు పెట్టి తలుపులను దగ్గరకు లాగి మూసింది

గబగబా ముందుకు నడిచింది. గేటు వరకూ దారికి రెండు ప్రక్కలా వున్న పూల మొక్కలు గాలికి మెల్లగా తలలు వూపుతున్నాయి. వీధిదీపం కాంతి కొబ్బరి ఆకుల మధ్యలోనించి మొక్కల మీద పడుతోంది.


సూట్కేసుతో గేటు దగ్గరకు వచ్చింది భవాని. గేటు తియ్యబోయి ఆగిపోయింది. ఎవరో చెయ్యిపట్టి ఆపినట్టు...

తను వెయ్యబోతున్న అడుగు మంచిదేనా?

తను నడవబోతున్న దారి సరయినదేనా?

అక్కడే బొమ్మలా నిలబడిపోయింది.

ఇప్పుడు తను వెయ్యబోయే అడుగుమీదే తన భవిష్యత్తు ఆధారపడివుంది. ఒక్కసారి



అడుగు ముందుకు వేసిన తర్వాత వెనక్కు తీసుకోవడం కష్టం.

విశ్వనాథంతో తన జీవితం సుఖమయం అవుతుందా? తన వారందరి నించీ కోల్పోయిన ప్రేమను రాగాలను విశ్వనాథం తనమీద కురిపించ గలడా?

మనసు త్వరగా అక్కడనించి కదల మంటున్నా కాళు కదలనట్లని పించింది భవానికి

నిజానికి విశ్వనాథంలో ఏంతక్కువ? చదువుకున్నవాడు, అందమయినవాడు, మంచి సంస్కారమున్న మనిషి జీవితంలో ప్రేమంటే ఏమిటో అది ఎంత గొప్పదో తనకు తెలియజేసిన మనిషి విశ్వనాథం. అలాంటి మనిషితో జీవితాన్ని పంచుకోవటానికి వెళుతోంది. ఇందులో తను తప్పటడుగు వేస్తున్నది ఏమీలేదు.

ముందుకు కదిలింది భవాని.

"నాకు అన్యాయం చెయ్యకు అక్కా" ఎదురుగా నిలబడి తన చెల్లెలు శకుంతల దీనంగా అడిగినట్లని పించింది భవానికి.

నిజమే తను పరోక్షంగా శకుంతలకు అన్యాయం చేస్తోంది తన సుఖం తను చూసుకుంటోంది. తన స్వార్థం తనదిగా ఆలోచిస్తోంది.

తను ఇలా వెళ్ళిపోయిన తర్వాత తన చెల్లెలిని ఎవరు చేసు కుంటారు? కులం కాని వాడితో లేచిపోయిన దాని చెల్లెలిని చేసుకోటానికి ఎవరు మాత్రం ముందుకు వస్తారు? మరి శకుంతల పెళ్ళి?

సందిగ్ధంలో పడి పోయింది భవాని.

మనసులో ఆతృత పెరిగి పోతోంది. ఇప్పటికే విశ్వనాథం స్టేషన్‌కు వచ్చి వుంటాడు తన కోసం ఎదురు చూస్తూ వుంటాడు తను గబగబా వెళ్ళాలి..

అక్కడినించి కదల బోయింది భవాని కాని కదలలేక పోయింది. కాళ్ళు ఎవరో మేకులు దిగగొట్టినట్లు నేలకు అంటుకు పోయాయి.

ఎవరైనా వస్తారేమోనని భయం..

ఏటూ తేల్చుకోలేని పరిస్థితి!

"అక్కా"

ఉలిక్కిపడి చూసింది భవాని.. తన దగ్గరగా నడిచి వచ్చిన శకుంతల.

"నువ్వా" భయంగా అన్నది.

"అవును. భయపడకు. నేనేం అరచి గొడవ చెయ్యటానికి రాలేదు.. ఇంకా ఇక్కడే వున్నావేం? ఎప్పుడో బయల్దేరి..."

ఆశ్చర్యపోయింది భవాని..

"వెళ్ళిపో అక్కా అవతల విశ్వనాథం నీకోసం ఎదురు చూస్తూ వుంటాడు"

"నీ కెలా తెలుసు?!" ఎట్లాగో గొంతు పెగల్చుకుని అడిగింది

"ఇందులో తెలియడానికి ఏముంది? ఇంత రాత్రివేళ నువ్వు సూట్కేసుతో బయల్దేరావంటే ఆ మాత్రం అర్థం చేసుకోలేనా"

మాట్లాడలేదు భవాని.

"వెళ్ళిపో అక్కా. మళ్ళీ ఎవరయినా వస్తే గొడవవుతుంది" తొందర చేసింది శకుంతల

"నీ గురించే ఆలోచిస్తున్నాను చెల్లీ."

"నా గురించా!"


# "కీర్తి కిరీటాలు"

## నవలకు ఆంధ్రప్రదేశ్ సాహిత్య అకాడమీ బహుమతి పొందిన
## శ్రీమతి యద్దనపూడి సులోచనా రాణిగారికి
## ఇవే మా అభినందనలు

క్వాలిటీ పబ్లిషర్స్
గంగాధర పబ్లికేషన్స్
శ్రీ కవితా పబ్లికేషన్స్
నవసాహితీ బుక్ హౌసు
దేవేంద్ర పబ్లిషర్స్
గోపీచంద్ పబ్లికేషన్స్
నాగేశ్వర పబ్లికేషన్స్
శ్రీ మహాలక్ష్మి పబ్లికేషన్స్

కావలిపాటి విజయలక్ష్మి
ఐ. వి. ఎస్. అచ్యుతవల్లి
తుర్లపాటి రాజేశ్వరి ఎం ఎ.(లిట్)
కాజాని కమల, బి.ఎ.
ఎస్. కె. వెంకటాచారి, ఎం.ఎ.
సితేపల్లి సీతాశర్మ
ఆర్. సంధ్యాదేవి
వై. జి. భవాని

డా. ప్రేమలతాదత్, ఎం. ఎస్‌సి. పి. హెచ్‌డి సైంటిస్ట్, కటక్
ప్రొఫెసర్ ఎస్ పి. శర్మ, ప్రిన్సిపాల్, బి.ఎ., బి.యిడి., పి హెచ్ డి మహారాజా ట్రైనింగ్ కాలేజి. విజయనగరం
డా. శ్రీమతి ఏ. వి. సీతాకుమారి, ఎం ఎస్ సి, పి. హెచ్.డి., ప్రిన్సిపాల్, విజయనగరం
కె నాగేశ్వరి, బి.ఎ., బి ఎస్‌సి., బి ఇ డి కాకినాడ
పి. హెచ్. రాజేశ్వరి పసుమర్రు

కాపీలు ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని షాపులలోనూ దొరుకును

DIMPLE 2308

"అవును. నేను ఇలాంటి పని చేసిన తర్వాత నిన్నెవరు చేసుకుంటారు?"

శకుంతల నవ్వింది.

"నువ్వు ఇలాంటి అమాయకురాలి వను కోలేదు. ఆ విశ్వనాథం నిన్నెలా ప్రేమించాడో నాకు అర్థం కాకుండా వుంది. నా పెళ్ళికోసమని నువ్వు కోరుకున్న మనిషిని, కోరుకున్న జీవితాన్ని మూర్ఖంగా వదులు కుంటావా? నీ ఇష్టాలను కాదనుకుంటావా? నా కోసం నువ్వు ఇలాంటి త్యాగాలు చెయ్యొద్దు అక్కా... నేను సహించలేను... నువ్వు చేసే ఈ పనివల్ల నా పెళ్ళికి ఏలాంటి ఇబ్బందీ వుండదు. ఒకవేళ ఇలాంటి పరిస్థితే వస్తే నేనుకూడా నీలాగే చేస్తాను... నీ దారినే నడుస్తాను... ముందు నువ్వు నడు..."

"చెల్లీ!"

"బయల్దేరు అక్కా... నువ్వింకేమీ మాట్లాడకు .. అక్కడ విశ్వనాథం నువ్వు రాలేదని కంగారు పడుతూ వుంటాడు"

"శకూ నీకెలా కృతజ్ఞతలు చెప్పుకోవాలో తెలీడంలేదు. ఈ ఇంట్లో నన్ను అర్థం చేసుకున్నదానివి నువ్వే ..నువ్వేచెల్లీ" భవాని కళ్ళలో నీళ్ళు సుడులు తిరిగాయి.

"కృతజ్ఞతలు చెప్పుకోవలసింది నేనక్కా... ఈ ఇంట్లో నేను తలచుకున్నప్పుడు నడవటానికి ఓ దారి ఏర్పరస్తున్నందుకు... ఇకనువ్వు ఇక్కడ్నించి కదులు. వెళ్ళక్కా విశ్వనాథంకు కోపం తెప్పించకు. బావగార్ని అడిగినట్టు చెప్పు విష్ యు బెస్టాఫ్ లక్" అని భవాని బుగ్గమీద ముద్దు పెట్టుకుని వెనక్కి తిరిగి ఇంట్లోకి నడిచింది శకుంతల.

# వెళ్ళిపో అక్కా

కన్నీళ్ళను పమిట చెంగుతో వత్తుకుంటూ రోడ్డుమీదకు వచ్చింది భవాని. సందుమలుపు తిరిగి మెయిన్ రోడ్డుమీదకు రాగానే ఖాళీరిక్షా కనిపించింది. అందులో ఎక్కి కూర్చుని "స్టేషన్‌కు పోనీ" అన్నది భవాని.

రివ్వున దూసుకుపోయింది రిక్షా. పదినిమిషాల తర్వాత స్టేషనుముందాగింది.

డబ్బులిచ్చి గబగబా ప్లాట్‌ఫారం మీదకు వచ్చింది భవాని

ట్రెయిను బయల్దేరటానికి సిద్ధంగా వుంది.

విశ్వనాథంకోసం ప్లాట్‌ఫారం మీద వెతుకుతోంది భవాని. అతను ఎక్కడా కనిపించలేదు.

ఏమయ్యాడు ఇతను? అసలు రాలేదా? వచ్చి ట్రెయిన్‌లో ఎక్కి కూర్చున్నాడా?

ప్రతి కంపార్టుమెంటునూ చూస్తూ వెళుతోంది భవాని.

విశ్వనాథం కనిపించలేదు...

భవాని గుండెలు టకటకా కొట్టుకుంటున్నాయి.

"భవానిగారూ" ఎవరో పిల్చారు.

ఆగిపోయి చూసింది. ప్రక్కనే విశ్వనాథం స్నేహితుడు సోమేశ్వరశర్మ ..

"మీ ఫ్రెండుతో వచ్చారా?" అడిగింది భవాని...

"కాదు... తను రాలేదు... నన్ను పంపించాడు. ఈ ఉత్తరం మీకు ఇవ్వమని చెప్పాడు" ప్యాంటు జేబులోనించి ఓ మడత పెట్టిన కాగితాన్ని తీసి భవాని చేతిలో వుంచాడు.

"ఉత్తరం పంపించాడా?!" ఆశ్చర్యంతో అనుమానంతో, భయంతో చదవటం మొదలు పెట్టింది.

చెయ్యి వణుకుతోంది.

సోమేశ్వరశర్మ అక్కడి నించి వెళ్ళిపోయాడు.

డియర్ భవానీ—

నువ్వు నన్ను స్వార్థపరుడిననుకున్నా నీచుడిననుకున్నాసరే ఇలా చెయ్యక తప్పడం లేదు మనం అనుకున్నట్టుగానే ఒంటి గంటకు ఇంట్లోనించి బయటకు గేటు దగ్గరకు వచ్చాను ఎలా చూసిందో మా చెల్లెలు వచ్చి నన్ను అడ్డుకుంది. 'నాకు అన్యాయంచేసి - వెళ్ళిపోతావా అన్నయ్యా! నువ్వు ఇలాంటిపని చేస్తే నన్నెవరు చేసుకుంటారు? నువ్వు వెళ్ళిపోకు అన్నయ్యా నీ స్వార్థం నువ్వు చూసుకొని నాకు ద్రోహం చెయ్యకు' అంటూ ఏడ్చింది భవానీ దాని ఏడుపు చూసి కరిగిపోయాను. దాని మాటలు కూడా నిజమేకదా! మన స్వార్థం మనం చూసుకుంటే వాళ్ళ మాటేమిటి? నీకూ ఇద్దరు చెల్లెళ్ళు వున్నారు గదా! వాళ్ళగురించి ఆలోచించు భవానీ ... నీ ఎదురుగా నిలబడి ఈ విషయాన్ని చెప్పుకునే ధైర్యంలేక ఇలా ఉత్తరం రాసి పంపుతున్నాను. ఈ ఉత్తరం నీకు తీరని వ్యధను, ఆశాభంగాన్ని కలుగజేస్తుందని నాకు తెలుసు. ఇందుకు నన్ను మన్నించు — విశ్వనాథం.

భవాని చేతిలోనించి సూట్కేసు క్రిందకి పడిపోయింది. ఎవరో బలవంతాన తన హృదయాన్ని కోస్తున్నట్టు విలవిల్లాడి పోయింది. దుఃఖం ఉప్పెనలా ముంచుకు వచ్చింది.

గార్డు విజిల్ వూదాడు రైలు కదిలింది పెద్దకూతతో. అప్పుడే పక్క పట్టాల మీదికి మరో రైలు దూసుకు వచ్చింది. భవాని చేతిలో కాయితం ఆ గాలి విసురుకు దూరంగా ఎగిరిపోయింది.

భవాని గుండెల్లో మతాబాలు కాలుస్తున్న చప్పుళ్ళు చిటపటలు, కళ్ళవెంట నీళ్ళు ధారగా కారుతున్నాయి కన్నీటిపొరల మధ్య దూరంగా వెళతున్న రైలు భవానికి మసక మసగ్గా కన్పిస్తోంది.

